విశాలాంధ్ర

సోమవారం 30, అక్టోబర్ 2023

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ప్రతిష్ఠాత్మకమైన నాక్ సంస్థ ద్వార గుర్తింపు బి గ్రేడ్ అక్రిడేషన్ లభించింది. నాక్ పీర్ టీం అక్టోబర్ 19, 20 తేదీలలో కళాశాలను సందర్శించి కళాశాల విద్యా ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, నాణ్యమైన విద్య పట్ల కళాశాల యొక్క నిబద్ధతను పరిశీలించి "బి" "గ్రేడ్ అక్రిడేషన్‌ను కళాశాలకు ఇవ్వడం జరిగినదని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. ఉషారాణి ఆదివారం ప్రకటన ద్వారా తెలియజేశారు. బి గ్రేడ్‌తో కొత్త కోర్సులను ప్రారంభించడానికి మౌలిక వసతులను మెరుగు పరచుకోవడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. గ్రేడ్‌ను సాధించడానికి కృషిచేసిన నాక్ కోఆర్డినేటర్ డి.జయ కుమారి మరియు కళాశాల సిబ్బందిని ఆమె అభినందించారు. అలాగే కళాశాల అభివృద్ధికి సహకరించిన కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులకు, పూర్వ విద్యార్థులకు, మీడియా ప్రతినిధులకు మరియు విద్యార్థిని, విద్యార్థులకు కళాశాల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

విశాలాంధ్ర

ప్రకాశం జిల్లా

రైతులకు సాంకేతిక సలహాలివ్వాలి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : వ్యవసాయశాఖ సిబ్బంది రైతులకు సరైన సమయంలో సాంకేతిక సలహాలివ్వాలని దర్శి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్ వీవీఎస్ దుర్గాప్రసాద్ అన్నారు. బేస్తవారిపేటలో శనివారం రబీ పంటల సాగులో మెళుకువలపై వ్యవసాయ విస్తరణాధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగిం చారు. ఈ సందర్భంగా పలు విభాగాలకు చెందిన శాస్త్రవేత్తలు రబీ పంటల సాగులో కొత్త వంగడాలు, చీడపీడల నివారణ, యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ టి. వెంకటేశ్వరరెడ్డి, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎం. జాహ్నవి, ఉద్యాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎం. శివ, ఏఓ జక్కం మెర్సీ, మార్కాపురం, గిద్దలూరు సబ్ డివిజన్ పరిధిలోని మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, 118 మంది రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పాత శంఖవరంలో మన ఊరు.. మన ఉగ్ర

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి మున్సిపాలిటీ లోని పాత శంఖవరం గ్రామంలో ఆదివారం మన ఊరు.. మన ఊరు కార్యక్రమం జరిగింది. మాజీ ఎమ్మెల్యే తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ చంద్రబాబు అక్రమ అరెస్టు తీరును ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కనిగిరి వైసీపీ పాలనలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండకడుతూ తెలుగు దేశం పార్టీకి మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు తమ్మినేని శ్రీనివాస్ రెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, షేక్ ఫిరోజ్, గుడిపాటి ఖాదర్, షేక్ అహ్మద్, కోట సురేష్ బాబు, పిచ్చల శ్రీనివాసరెడ్డి, వాజీదా, పార్వతీ, అరుణ, కరిమున్నీసా, తదితరులు పాల్గొన్నారు.

దారపనేనికి పలువురి పరామర్శ

విశాలాంధ్ర-పామూరు : కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ఇటీవల స్వల్ప అస్వస్థత చెంది మెరుగైన వైద్యం చేయించుకొని సంపూర్ణ ఆరోగ్యంతో హైదరాబాద్ లోని ఆయన స్వగృహానికి చేరారు. ఆదివారం ఒంగోలు మాజీ ఏఎంసీ చైర్మన్ అయినాబత్తుని ఘన శ్యామ్, వరదా నాగేశ్వరరావు, తేలప్రోలు కాశయ్య స్వామి దారపనేనిని పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యంపై అశ్రద్ధ విడనాడాలని ఆరోగ్య వంతులుగా ఉండేందుకు కృషి చేయాలని కోరారు. నాగినేని రామకృష్ణ, షేక్ అబ్దుల్ ఖాదర్, దారపనేని దేవరెంటి కృష్ణ, మిరియం సుబ్బరాయుడు, దారపనేని చంద్రశేఖర్ సోదరుడు దారపనేని కృష్ణ పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆహ్వానం

విశాలాంధ్ర-కనిగిరి : ప్రకాశం జిల్లా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ జరగనున్న నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవానికి కనిగిరి నియోజకవర్గం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష కార్యదర్శులు షేక్ నాయబ్ రసూల్ ఏర్ల విజయరామరాజుకు ఆదివారం ఆహ్వానం అందింది. జిల్లా బీసీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షులు బలగాని ఆంజనేయులు, రాష్ట్ర నాయకులు గోనుగుంట బ్రహ్మానంద శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బందారు సోమరాజు ఆహ్వానం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార ఇమామ్, మరియు నూర్ భాషా సంఘం నాయకులు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు పాల్గొన్నారు. నేడు గుంటూరులో జరగబోయే నూరు భాషా దూదేకుల గర్జన విజయవంతంగా జరగాలని బీసీ సంక్షేమ సంఘం నాయకులు మద్దతు తెలపడం జరిగింది.

తొగట వీర క్షత్రియ రాష్ట్ర కార్య నిర్వహణ కార్యదర్శిగా రాము

విశాలాంధ్ర-బేస్తవారిపేట : తొగట వీర క్షత్రియ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా బేస్తవారిపేటకు చెందిన ముప్పూరి రాము నియమితుల య్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర తొగట వీర క్షత్రియ కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు మోడెమ్ వీరాంజనేయ ప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. తనను తొగట వీర క్షత్రియ రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయ ప్రసాద్, తనకు పదవి రావడానికి సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి... భగీరథ గంగమ్మ తల్లి



విశాలాంధ్ర-పీసీపల్లి : మండలంలో పెదఅలవల పాడు గ్రామపంచాయతీ పరిధిలో వెంగలాపురం సమీపంలో పాలేటినది ఒడ్డున ప్రముఖ ప్రసిద్ధి గాంచిన భగీరథ పాలేటి గంగమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం ఇతర ప్రాంతాల నుండి భక్తులు అధికంగా రావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పాల పొంగళ్ళు పెట్టుకొని తలనీలాలు సమర్పించుకుని మొక్కులు ఉన్నవారు ప్రత్యేక పూజలు నిర్వహించారు.నూతన వాహన ములకు పూజలు చేయించారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో రావడంతో ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు.

యువ ఓటర్ల పై దృష్టి సారించాలి

సమన్వయ సమావేశంలో రాష్ట్ర టీడీపీ తెలుగు యువత కార్యదర్శి వేణుబాబు



విశాలాంధ్ర-తాళ్లూరు : తెలుగుదేశం, జనసేన పార్టీలు యువ ఓటర్ల పై దృష్టి సారించాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ తెలుగు యువత కార్యదర్శి మండలంలోని కొత్రపాటి వారి పాలెం గ్రామానికి చెందిన గొల్లపూడి వేణుబాబు అన్నారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఆదివారం తెలుగుదేశం, జనసేన పార్టీల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి హాజరైన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ తెలుగు యువత కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు సమన్వయంగా తమ బలాన్ని నిరూపించవలసిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు. ఎన్నికల్లో యువతను ఏకం చేసి ఓటర్ల నమోదు కార్యక్రమంలో, ఓటర్ల మార్పు, చేర్పుల్లో యువత ముందుండి పార్టీలు ఐక్యంగా గెలుపు పై దృష్టి సారించి పని చేయాలని పిలుపు నిచ్చారు. తెలుగుదేశం, జనసేన పార్టీల కలయిక గెలుపుకు సంకేతం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు, యువ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నిజం గెలవడం తథ్యం

విశాలాంధ్ర-వెలిగండ్ల : రాష్ట్ర తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి, మాజీ శాసన సభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కి నిరసనగా మండల పార్టీ అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో కళ్ళు తెరిపిద్దాం అనే కార్యక్రమం మండలం లోని మొగల్లూరు ప్రధాన కూడలిలో కళ్ళకి నల్ల రిబ్బన్ కట్టుకొని "నిజం గెలవాలి అనే నినాదాలు ఇచ్చి నిరసన తెలియజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్ రెడ్డి, మండల పార్టీ ఉపాధ్యక్షులు మోటాటి సుబ్బారెడ్డి, అక్కి శ్రీనివాసులు రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షులు పల్నాటి బాల కోటిరెడ్డి, ఆవుల మాల కొండారెడ్డి, వాణిజ్య విభాగం అధ్యక్షులు మైనార్టీ సెల్ అధ్యక్షులు మజహర్, ప్రధాన కార్యదర్శి వేణు గోపాల్, నరేంద్ర, గోపాల్‌రెడ్డి, మౌలాషా, మహేంద్ర రెడ్డి, మొఘూరి కోటేశ్వరరావు, నాయుడు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమార్కుల చెరలో చిలకలేరు

- వాగులు ఆక్రమించే లక్షల సొమ్ము చేసుకున్న కబ్జాదారులు
- వాగు పోయి కాలువ అయ్యే
- వాగు వస్తే ముంపునకు గురై నష్టపోతామని ఆందోళన చెందుతున్న రైతులు

అసలైన చిలక లేరు వాగు ఇదే

విశాలాంధ్ర-ముండ్లమూరు : చిలక లేరువాగు అక్రమార్కుల ఆక్రమణల్లో కూచించుకుపోయినది. దీంతో వాగు వస్తే చిన్న కాలువల వలె తయారైంది. మండలంలో భూకబ్జాలు జరుగుతుండడంతో నివారణ చర్యలు తీసుకోవడంలో రెవెన్యూ అధికారులు మీనామేషాలు లెక్కిస్తుండడంతో భూ కబ్జాదారులకు వరంగా మారింది. దీంతో వాగులు వంకలు అనే తేడా లేకుండా ఎక్కడపడితే అక్కడ కబ్జాలకు తెరలేపుతున్నారు. తాజాగా ముండ్ల మూరు రెవిన్యూ పరిధిలో సర్వే నెంబరు 1 పూర్తిస్థాయి వాగు ఆక్రమణదారులు చెరపట్టడంతో ఆ ప్రాంతంలో పిల్ల కాలువలే తయారైంది. దీంతో సమీప ప్రాంత రైతులు వాగే ఉధృతంగా వస్తే ఆ సమయాల్లో తమ పొలాల్లోకి నీరు వెనక్కి తన్ని పంట అంతా మునిగిపోయే ప్రమాదం ఉందని ఎస్సీ రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రాంతంలో కొందరు బడా బాబులు అనధికారికంగా చాపలచెరువులుగా మార్చడంలో నిమగ్నమయ్యారు. దీంతో ఎడాపెడా ప్రభుత్వభూములు, వాగు పోరంబోకు భూములకు ఆక్రమణలకు తెరతీశారు. ఒకవైపు ప్రభుత్వ భూములతో పాటు వాగు పొలాలను కూడా ఆక్రమించడమే కాకుండా ఆ ప్రాంతంలో ఇసుకను కూడా సొమ్ము చేసుకుంటున్నారు. ప్రైవేట్ వ్యక్తులు తమ ఇసుక అక్రమ రవాణా కోసం అద్దంకి దర్శి రహదారి పక్కనే ఉన్న తోడేళ్ల వాగుమట్టి రోడ్డు సైతం మరమ్మతులు చేయించి ఆ రోడ్డు మార్గాన రాత్రు సమయాల్లో వాగులలో ప్రభుత్వ భూములలో ఇసుకను అక్రమంగా తరలిస్తూ లక్షల సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమాల పర్వం గురించి రెవిన్యూ అధికారులకు తెలిసిన ఏమి తెలియనట్టు నటిస్తున్నారు. దీంతో చుట్టూ పక్కల వాగులు వంకలు చెరువులు యథేచ్ఛగా కబ్జాలు చేస్తున్నారు. కోట్లు విలువైనభూములు కాపాడాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు.

భూ కబ్జా చట్టం అమలు ఎక్కడ? :-

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై ఆక్రమించిన వారిపై ప్రభుత్వం 1982లో భూ కబ్జా చట్టాన్ని తెచ్చింది. చట్టాన్ని సక్రమంగా అమలు చేయాల్సిన అధికారులు అందుకు తిలోదకాలు ఇచ్చారు. ప్రభుత్వ స్థలాలు పొలాలు ఆక్రమించినట్లయితే జైలు శిక్ష జరిమానా విధించే అవకాశం ఉంది. చట్టాన్ని పటిష్టంగా అమలు చేయలేకపోవడంతో రాజకీయంగా, ఆర్థికంగా పలుకుబడి గలవారు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు కళ్ళు తెరిచి ప్రభుత్వ స్థలాలను వాగులు వంకలను కబ్జాల నుండి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. వాగు ఆక్రమణలను అడ్డుకోవాలి.

గోపన బోయిన ఆదినారాయణ ముండ్లమూరు :-

వాగు కొద్దిపాటి ఆక్రమాలకు గురైనప్పుడు స్పందించి అధికారుల అడ్డుకుంటే ఆక్రమ ణలు తప్పేవి. ప్రస్తుతం అధికా రుల అలసత్వాన్ని ఆసరాగా తీసుకొని వాగు మొత్తం కూడా ఆక్రమించే పరిస్థితులు వచ్చాయి. అధికారులు తక్షణమే స్పందించి అడ్డుకోవాలి.

వాగు పొంగితే కోత తప్పదు-తాతపూడి శాంత కుమార్ ముండ్లమూరు :

చిలక లేరువాగు ఆక్రమణలకు గురవుతున్నడంతో వాగు కాస్త కాలువ వలె మారింది. దీంతో వర్షాల సమయంలో వాగు పొంగినట్లయితే వాగు నీరు వెనక్కి తన్ని మా భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని. దానివలన తీవ్ర నష్టపోయే అవకాశం ఉంది.

తహసిల్దార్ వివరణ :- తహశీల్దార్ మహమ్మద్ నయీమ్ అహ్మద్ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని, ఆక్రమణల విషయం తన దృష్టికి రాలేదని, వాగులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని తహసిల్దార్ విశాలాంధ్ర విలేఖరికి తెలిపారు.

పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

విశాలాంధ్ర-ఒంగోలు : పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా పోలీస్ సిబ్బంది సంక్షేమం దృష్ట్యా ఆదివారం పోలీస్ కళ్యాణ మండపంలో పోలీస్ సిబ్బంది, విశ్రాంత సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు మరియు హోమ్ గార్డ్స్‌లకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. పోలీసు సిబ్బంది ఆరోగ్య రక్షణే లక్ష్యంగా నిర్వహించిన ఈ క్యాంపులో సంఘమిత్ర, ఉపాస్ సూపర్ స్పెషాలిటీ మరియు ఆర్కిడ్ ఫెర్టిలిటి హాస్పిటల్స్‌కు చెందిన స్పెషలిస్ట్ డాక్టర్లచే సాధారణ వ్యాధులు, ఎముకలు, చిన్న పిల్లల వ్యాధులు, గుండె జబ్బులు, ఊపిరితిత్తులు, నరాలు, జీర్ణాశయ, మూత్రపిండాలు సంబంధిత వ్యాధులు, డైటరీ, ఫెర్టిలిటీ & గైనకాలజీకి సంబంధించి మెడికల్ చెక్ అప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు విధులు చాలా కష్టంతో కూడుకున్నవని, డ్యూటీ సమయాలు చాలా భిన్నంగా ఉండట వలనే కాక ఒత్తిడి వల్ల కూడా అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని, అదే ఒత్తిడి వారి కుటుంబ సభ్యులపై కూడా ఉంటుందని, దీని దృష్ట్యా పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ పలు ఆరోగ్య సమస్యలకు సంబంధించిన టెస్టులు చేయుటకు ఈ ఉచిత మెడికల్ క్యాంపును ప్రత్యేక ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. పోలీసులు, వారి కుటుంబ సభ్యులు వారి ఆరోగ్య సంరక్షణ పట్ల సరైన అవగాహన లేక నిర్లక్ష్యం చేసి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కావున నిత్యం ప్రజా సేవకే అంకితమయ్యే పోలీసులు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, స్వల్ప అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యుల్ని సంప్రదించి తగిన చికిత్స పొందాలని, మంచి ఆహారపు అలవాట్లు పాటించాలని, క్రమం తప్పకుండా వ్యాయామాలు చెయ్యాలని, ఆరో గ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పోలీసులు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం బాగుంటు ందని పేర్కొన్నారు. ఈ ఉచిత మెగా క్యాంపు ఏర్పాటుకు కృషి చేసిన జిల్లా ఎస్పీ కి, డాక్టర్లకు పోలీస్ సిబ్బంది మరియు వారి కుటుంబం సభ్యులు కృతజ్ఞతలు తెలియచేసినారు. ఈ మెడికల్ క్యాంపును చక్కగా సిద్ధం చేసిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ మెడికల్ క్యాంపులో పోలీస్ యూనిట్ డాక్టర్ భానుమతి, సంఘమిత్ర హాస్పిటల్ కు చెందిన

జిల్లా ఎస్పీ

డాక్టర్లు శివ కుమార్, ఎస్.కె.ఫైరోజ్, యం. ప్రియాంక, షాలిని, బి.నాగమనీ, శ్రీధర్ రెడ్డి, ఉపాస్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్‌లు కె. అనిల్ కుమార్, పి.శ్రీనివాసరావు, యు.శ్రీనివాసులు, ఆర్కిడ్ ఫెర్టిలిటి సెంటర్‌కు చెందిన డాక్టర్ సింధూర సింగ్ మరియు డాక్టర్లు సిబ్బందికి బీ.పీ, షుగర్ టెస్ట్, ఈసీజీ, 2డీ ఎకోకార్డియోగ్రాఫీ మరియు ఇతర జనరల్ సంబంధిత పలు వైద్య పరీక్షలను నిర్వహించారు. ఆరోగ్యపరమైన అంశాలలో పోలీస్ సిబ్బంది మరియు ప్రజలకు డాక్టర్లు సలహాలు, సూచ నలను తెలియజేసి, మెడిసిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ అశోక్ బాబు గారు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియా దాసు, ఒంగోలు డిఎస్పీ నారాయణ స్వామి రెడ్డి, ఒంగోలు ట్రాఫిక్ డిఎస్పీ శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ భక్తవత్సలు రెడ్డి, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, హరిబాబు, ఆర్ఎస్ఐలు, పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలి

నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

విశాలాంధ్ర-కనిగిరి : పొట్టి శ్రీరాములు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఆదివారం కనిగిరి డిపోలో ఆర్టీసీ సిబ్బంది నల్ల బ్యాడ్జి ధరించి నిరసన తెలిపారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ డ్రైవర్ పై దాడి చేసిన విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ వారిని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ ప్రజా రవాణా శాఖ ఉద్యోగులు డిమాండ్ చేశారు.ఈ ఘటనకు కారకులైన వారిని అరెస్ట్ చేయడంలో పోలీసులు చురుగ్గా వ్యవహరించాలని కోరారు. దాడి జరిగిన సమయంలో పోలీస్ వారు వెంటనే స్పందించి డ్రైవర్‌ను స్థానిక హాస్పిటల్లో చేర్చి ప్రాణాపాయం నుంచి తప్పించినందుకు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ప్రజా రవాణా శాఖ ఉద్యోగైన ఆర్టీసీ డ్రైవర్ పై అనుచితంగా ప్రవర్తించి విచక్షణ రహితంగా భౌతిక దాడి చేసిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, అలాగేభవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగులపై ఇలాంటి సంఘటనలు పునరావతం కాకుండా ప్రభుత్వ ఉద్యోగులైన ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నాయకులు జి.సుందర రావు, సయ్యద్ పీరావలి, యం.రమేష్ బాబు, ఎస్ కె.సమీర్, వెంకటేశ్వర్లు, సుబ్బారావు,డ్రైవర్లు, కండక్టర్లు గ్యారేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్

విశాలాంధ్ర-పామూరు : ప్రజల మా, ప్రాణ రక్షణ కొరకు ప్రాణ త్యాగాలు చేసిన పోలీస్ సేవలు మరువలేని కనిగిరి శాసనసభ్యులు బుర్ర మధుసూదన్ యాదవ్ అన్నారు. ఆదివారం స్థానిక అనిల్ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో పోలీస్ అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరమును ఎమ్మెల్యే బుర్ర మోసుకుని యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో విధి నిర్వహణలో అమరులైన పోలీస్ త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి ఏడాది సేవా కార్యక్ర మాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సి ఐ కాటూరి శ్రీనివాసరావు, ఎస్ ఐ కే సురేష్ బాబు, ఎంపీపీ గంగసాని లక్ష్మీ హుస్సేన్ రెడ్డి, వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్‌రెడ్డి, వైసీపీ మండల యువజన అధ్యక్షులు పట్టణ ఉప సర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, వైసిపి పక్కన అధ్యక్షులు చాంద్ బాషా (సెంట్రింగ్ బుజ్జి), గట్ల విజయ భాస్కర్‌రెడ్డి, ఇనిమెర్ల సర్పంచ్ సిద్ద మూర్తి లక్ష్మీనారా యణ రెడ్డి, దుబగుంట ఉపసర్పంచ్ కందుల శ్రీనువాసులు రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ షైక్ ఖాదర్ భాషా, చేని కాల శ్రీనివాసులు, శ్రీరామ్ శ్రీనివాసులు, చల్ల శివ జగదాభి సునీల్, నిరుకట్టు రసూల్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

అహోబిలం నరసింహస్వామికి బంగారు కవచం కిరీటం అందజేసిన దేవకి

ఎమ్మెల్యే బిజేంద్రనాథ్ తో కలసి స్వామి వారిని దర్శించుకున్న దేవకి

విశాలాంధ్ర-కనిగిరి : అహోబిలం లక్ష్మీ నరసింహ స్వామివారికి బంగారు వక్షస్థలాన్ని, బంగారు కిరీ టాన్ని బెంగళూరుకు చెందిన ఏ దిలీప్ కుమార్ వాసవి సత్ర సముదాయాల అధ్యక్షులు దేవకి వెంక టేశ్వర్లు దంపతుల చేతుల మీదుగా స్వామివారికి అందజేశారు. ఆర్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజయేం ద్రనాథ్ రెడ్డి, దాత దిలీప్ కుమార్‌తో కలిసి దేవకి వెంకటేశ్వర్లు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు, వేద ఆశీర్వచనం, స్వామి వారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా దేవకి మాట్లాడుతూ అహోబిలం శ్రీ లక్ష్మీనర సింహస్వామి వారికి తన చేతుల మీదుగా బంగారు ఆభరణాలు అందించడం తన పూర్వ జన్మ సుకృతంగా భావిస్తు న్నానని అన్నారు. ఈ కార్య క్రమంలో దిలీప్ కుమార్ కుటుంబ సభ్యులు, బివి శ్రీకాంత్, లీలా మహేష్, గొంట్ల మోహన్రావు పాల్గొన్నారు.

రాబోవు ఎన్నికలలో బహుజనుల చైతన్యం కీలకం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : రానున్న సార్వత్రిక ఎన్నికలలో చైతన్యవంతులైన బహుజనుల పాత్ర కీలకం కాబోతున్న దని,వారి సత్తా చూపించే వేదికగా ఎన్నికలుంటాయని ఓ.బి.సి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జి.వీరభద్రాచారి అభిప్రాయ పడ్డారు.ఆదివారం సంఘం కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ యస్సీ, యస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను ఉత్తిత్తి పథకాలతో పథకం ప్రకారం గా చేస్తున్న అన్యాయాలను గమనిస్తున్న నేపథ్యంలో వారు అప్రమత్తమై గుణపాఠం చెప్తారని అన్నారు.అందరికీ సంక్షేమం పేరుతో సంక్షేమాన్ని బహుజనులకు దూరం చేసిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.పాలక వర్గాలుగా, పాలక కులాలుగా, పాలక పార్టీలుగా చలామణి అవుతున్న రెండు కులాలు నేడు పేదవాడి సంక్షేమంలో వాటాదారులుగా మారిపోయారని అన్నారు.వారితోపాటు రేషన్ బియ్యం, పెన్షన్లు, చేదోడు, చేయూత, జగనన్న కాలనీలు,ఇండ్లు లాంటి అన్ని పథకాలను బహుజనులకు ఇస్తూ వీరికోసం దేశంలో ఎవ్వరూ చేయనిది మేము చేస్తున్నట్టు ప్రభుత్వం చెప్పుకోవడం విడ్డూరమన్నారు.ఉదాహరణకు ఉన్న గుడిసెని పడగొట్టుకొని ప్రభుత్వం ఇచ్చే ఇంటికోసం ఇచ్చే ప్రభుత్వ సాయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ఒకటే, ఒక ఇల్లు ఉండి, ఆర్థిక స్థోమత ఉండి, మరో ఇంటి కోసం ప్రభుత్వ సాయాన్ని వాడుకుందామనుకొనే ఇతర కులాలకు ఒకటే సాయంగా ఇస్తున్న తీరులో ప్రభుత్వ ఉద్దేశ్యం అద్దం పడుతోందన్నారు. సామాజికంగా అణగారిన వర్గాల జీవన శాశ్వత అభ్యున్నతికి పాటుపడని ప్రస్తుత ప్రభుత్వం సాధికార బస్సు యాత్ర పేరుతో ప్రజలలోకి వస్తున్న తీరు మోసపూరితమైన విధానంగా ఉన్నద న్నారు. బహుజన వర్గాలు దీనిపై నిశితంగా గమనిస్తున్నారని, రాబోవు ఎన్నికలలో బహుజనుల చైతన్యం ఈ మోసపుపాలక వర్గాలకు చెంప పెట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు బ్రాహ్మణ పల్లి లోకనాథం, పొద్దుటూరి భాస్కర్,వి.ఉదయ కుమార్, గూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కనే నిర్లక్ష్యంగా డంపింగ్ యార్డ్

- దంపింగ్ యార్డ్ ఏర్పాటులో అధికారులు పాలకులు వైఫల్యం...!
- వ్యర్థాలు కాల్చిన పొగతో వాహనదారులు ఉక్కిరిబిక్కిరి
- ప్రమాదాలకు కారణమవుతున్న పొగ

రహదారి కనపడకుండా కమ్మేసిన పొగ

విశాలాంధ్ర నాగులుప్పలపాడు :- అతిపెద్ద మేజర్ పంచాయతీ ఆ గ్రామం నిత్యం వందల సంఖ్యలో ప్రజలు ఆ గ్రామానికి రాకపోకలు సాగిస్తుంటారు నిత్యం వ్యాపారాలతో కళకళలాడుతుంటుంది.గత పాలకుల చిత్తశుద్ధి పరిపాలనతో గతంలో ఆ గ్రామపంచాయతీ ఐదుసార్లు ఉత్తమ అవార్డులను సైతం అందుకుని మిగిలిన గ్రామపంచాయతీలకు ఆదర్శంగా నిలిచింది అదే ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీ ప్రస్తుతం ఉప్పుగుండూరు గ్రామ పంచాయతీలో డంపింగ్ యార్డ్ లేక గ్రామంలోని వ్యర్థాలను రోడ్డు పక్కనే వదిలి ఆ వ్యర్థాలను తగలబెట్టడంతో ఆ దాటికి వస్తున్న పొగతో ప్రజలు ,వాహనదారులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గతంలో గ్రామంలోని వ్యర్థాలను ఒంగోలు చీరాల జాతీయ రహదారి ప్రక్కన నాగన్న వాగు సమీపంలో వదిలి ఎప్పటికప్పుడు వాటిని తగుల పెట్టడంతో ఆ పొగదాటికి అనేకసార్లు వాహనాలు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. నాగన్న వాగు వద్ద వ్యర్థాలను వదిలి పెద్ద ఎత్తున పొగ వ్యాప్తి చెందుతూ ఉండటంతో గుర్తించిన అప్పటి కలెక్టర్ అప్పటి గ్రామపంచాయతీ కార్యదర్శి ని సైతం సస్పెండ్ చేయడం జరిగింది. ఆ సంఘటనతోనైనా ఏమాత్రం స్పందించని పాలకులు అధికారుల ఇప్పటివరకు సైతం నిర్లక్ష్య ధోరణితో గ్రామానికి డంపింగ్ యార్డ్ ఏర్పాటు చేయలేకపో యారన్న విమర్శలు వెలువెత్తు తున్నాయి. జాతీయ రహదారి పక్కన నిత్యం ఉన్నతాధికారులు ప్రయాణి స్తుండటంతో సమస్యగా మారింది అనుకున్న గ్రామపంచాయతీ పాలకులు అధికారులు తమ పంధాను మార్చి పాత రహదారి లోని హ్యాపీ ల్యాండ్ సమీపంలో మళ్లీ పాత పద్ధతి లోనే రహదారి పక్కన గ్రామపంచాయతీ వ్యర్థాలను డంపింగ్ చేసి నిత్యం వాటిని కాలుస్తుం డటంతో ఆ పొగదాటికి అటు వైపుగా వచ్చే వాహనాలు ఒక దానికొకటి కనిపించక ప్రమా దాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. ఇటీవల అక్కడ వస్తున్న పొగ దాటికి ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపిం చక ఆర్టీసీ బస్సును ఇసుక ట్రాక్టర్ ఢీకొనడంతో పది మంది గాయాలు పాలయ్యారు. దీంతోపాటు ద్విచక్ర వాహందారులు సైతం అనేకసార్లు ప్రమా దాలకు గురైన సంఘటనలు ఉన్నాయి.

డంపింగ్ యార్డ్ నుండి వెలువడే పొగ దాటికి ప్రమాదాలు చోటు చేసుకున్నట్లుగా పోలీసులు సైతం ప్రాథమిక నిర్ధార ణకు వచ్చారు. జాతీయ రహదారి ప్రక్కన నూత ˇనంగా నిర్మించిన 100 అడుగుల సాయిబాబా విగ్రహంతో కూడిన దేవాలయానికి వెళ్లే భక్తులకు నిత్యం నరకం కనిపిస్తుంది. రాకపోకలు సాగించే సామాన్య ప్రజలు భక్తులు సైతం తీవ్ర అసౌకర్యానికి గురవుతూ అక్కడ వెలువడే పొగకు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వ్యర్థాలు అన్ని అక్కడే వదిలేయ డంతో దుర్వాసన సైతం వెదజల్లుతూ ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద మేజర్ గ్రామపంచాయతీ అయిన ఉప్పుగుండూరుకు డంపింగ్ యార్డును ఏర్పాటు చేసుకోవడంలో పాలకులు అధికారుల నిర్లక్ష్యాన్ని ఎండ గడుతున్నారు. అదే సమస్యను అనేకసార్లు పలువురు గ్రామ పెద్దలు గ్రామ పంచాయతీ పాలకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఏమాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఎంతో పేరు ప్రఖ్యాతులు కలిగిన ఉప్పుగుండూరు గ్రామపంచాయతీకి డంపింగ్ యార్డ్‌ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రక్తదానం చేసి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచిన జిల్లా పోలీసులు

– జిల్లా ఎస్పీ మలిక గర్గ్

విశాలాంధ్ర-ఒంగోలు : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీసుల ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సంస్మరణోత్సవాల సందర్భంగా జిల్లాలోని అన్ని సబ్ డివిజన్ పరిధిలో ఏర్పాటుచేసిన రక్తదాన క్యాంపులకు పోలీసు సిబ్బంది, విద్యార్థులు మరియు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదానం చేస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు. పోలీసు అమరవీరుల త్యాగాలను, సేవలను స్ఫూర్తిగా తీసుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని సబ్ డివిజన్ పరిధిలో నిర్వహించిన రక్తదాన శిబిరాల్లో పోలీసు సిబ్బంది, విద్యార్థులు, ఉద్యోగులు మరియు ప్రజలు 606 మంది పాల్గొని స్వచ్ఛందంగా 606 యూనిట్ల రక్తదానం చేశారని ఎస్పీ గారు తెలియజేశారు. జిల్లా పోలీసు సిబ్బంది ప్రజా పరిరక్షణ బాధ్యతే లక్ష్యంగా రక్తదానం చేసి స్ఫూర్తి ప్రదాతలుగా నిలిచారని, స్వచ్ఛందంగా చాలామంది రక్తదానం చేయటానికి ముందుకు రావడం చాలా అభినందనీయమని అన్నారు. ఈ రక్తదానం చేయటం వలన ఎవరైనా రోడ్డుప్రమాదాలు, రక్త హీనత, ప్రాణాంతకమైన వ్యాధులు మరియు ఇతర ఆపద సమయాలలో అత్యవసరంగా రక్తం దొరక్క ఇబ్బంది పడేవారికి ప్రాణ దానం చేసినట్లేనని, కావున సమాజ శ్రేయస్సు కొరకు మనమంతా రక్తదానం చేయుటకు ముందుండాలని కోరారు.

మయూరి లాడ్జి నుంచి విరాట్ నగర్ డబల్ రోడ్డు నిర్మాణం చేపట్టాలి

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన ఎంపీటీసీ ఆకుపాటి

విశాలాంధ్ర-పొదిలి : స్థానిక నెల్లూరు రోడ్డులోని మయూరి లాడ్జి నుండి విరాట్ నగర్ 565 జాతీయ రహదారి వరకు ఉన్న ఆర్ అండ్ బి సింగిల్ రోడ్డును డబల్ రోడ్డు గా మార్చాలని పట్టణ రెండవ ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ ఆదివారం కనిగిరి శాసనసభ్యులు మధుసూదన్ యాదవ్ కు వినతి పత్రం అందజేశారు. ఇప్పుడున్న సింగిల్ సిమెంట్ రోడ్డు వలన అనేక ప్రమాదాలు జరిగినట్లు వెంకటేష్ తెలిపారు. వివిధ సందర్భాల్లో ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ డబల్ రోడ్డు నిర్మాణమునకు ప్రతిపాదనలు, నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు.

గుంటి గంగలో భక్తుల సందడి

10,559 రూపాయల ఆదాయం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకాశం జిల్లాలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన తాళ్లూరు మండలం, తూర్పు గంగవరం పంచాయితీ పరిధిలో గల సోమవరప్పాడు గ్రామ పరిసరాలలో ఉన్న గుంటి గంగక్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఉదయము నుండే ఆలయ పూజారి విజయలక్ష్మి గుంటి గంగ మూల విరాట్‌ను పట్టు వస్త్రాలతో పూలమాలలతో, బంగారు, వెండి ఆభరణాలతో అందంగా అలంకరించి పూజా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. దేవాదాయ శాఖ ఈవో నేలి భాస్కర్ రెడ్డి దేవాలయంలోనే ఉండి భక్తులకు అందుతున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. 374 దర్శనం టికెట్లు, 10 వాహన పూజలు జరిగాయని, అమ్మవారికి భక్తులు 10 చీరలు, 6,319 రూ. విరాళాలు అందించారని, ఆదివారం ఒక్కరోజు 10,559 రూపాయల ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ రికార్డ్ అసిస్టెంట్ కే శ్రీనివాసరావు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాదాయ శాఖ సిబ్బంది, అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

నా మట్టి నా దేశం చేపట్టిన తిండి

విశాలాంధ్ర-దర్శి : దర్శి పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు తిండి నారాయణరెడ్డి, నా మట్టి నా దేశం కార్యక్రమంలో భాగంగా దర్శి నియోజ కవర్గం నుండి ఢిల్లీ బయలుదేరు తున్న సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు తిండి నారాయణరెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు కూరపాటి సుబ్బారావు, కురిచేడు మండల అధ్యక్షులు కురుగంటి నాగేశ్వరరావు, కురిచేడు మండల ప్రధాన కార్యదర్శి చెన్నం శెట్టి పిచ్చయ్య, యువమోర్చా నాయకులు అచ్యుత సాయి ప్రసన్న ఢిల్లీ బయలుదేరడం జరిగింది. నారాయణరెడ్డి మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలపై ప్రజలకు వివరిస్తూ చేతనపరచేందుకు చేపట్టామన్నారు. అలాగే భాగంగా ఢిల్లీ వెళ్లిందుకు సిద్ధం చేశామని చెప్పారు. ఢిల్లీలో పార్టీ పెద్దలను కలర్ ఉన్నట్లు ఆయన ఈ కార్యక్రమంలో వారికి స్వాగతం పలికారు.

తాటిచెర్ల మోటులో వాల్మీకి జయంతి వేడుకలు

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని తాటిచెర్ల మోటులో స్థానిక సర్పంచ్ భర్త, వైసిపి నాయకులు బొమ్మని వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తాటిచెర్ల గ్రామ వాల్మీకి యూత్ బైక్ ర్యాలీ నిర్వహించారు. యూత్ ఏర్పాటు చేసిన భారీ కేకును బొమ్మని వెంకటేశ్వర్లు కట్ చేసి అందరికి పంచి పెట్టి వాల్మీకి జయంతి వేడుకలు నిర్వహించారు.

టీడీపీ అధికార ప్రతినిధితో వెలిగండ్ల నాయకులు

విశాలాంధ్ర-వెలిగండ్ల : తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెస్ రాజు తలపెట్టిన సైకిల్ యాత్రకు సంఘీభావంగా ఆదివారం అద్దంకికి విచ్చేసిన రాష్ట్ర ఎస్సీ అధికార ప్రతినిధి మాణిక్యరావును టీడీపీ వెలిగండ్ల మండల ప్రధాన కార్యదర్శిని గోన ప్రతాప్ ఫౌండేషన్ అధ్యక్షులు తగర ఇమ్మానియేల్ మర్యాదపూర్వకంగా కలిసి సైకిల్ యాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగ వ్యవస్థలు దుర్వినియోగం చేస్తూ ఎస్సీలకు 27 పథకాలను రద్దు చేసిన ఘనత వైసీపీ జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందని ఏ ముఖ్యమంత్రి సాహసం చేయని పనిని ఈ ముఖ్యమంత్రి చేయడం దళితుల ఎదురు 2024లో తగిన గుణపాఠం చెప్తారని ఈ సందర్భంగా తెలిపారు.

నల్ల రిబ్బన్‌తో టీడీపీ నాయకులు నిరసన

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం మండల కేంద్రంలోని దోర్నాల లోని స్థానిక నటరాజ్ సెంటర్లో తెలుగుదేశం పార్టీ నాయకులు నిజం గెలవాలి అని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు నల్ల గుడ్డలు కట్టుకొని, నిరసన వ్యక్తం చేశారు. జగనాసుర చీకటి పాలనకు నిరసనగా కళ్ళు తెరిపిద్దాం ఈ కార్యక్రమంలో మాజీ మండల కమిటీ అంబటి వీరారెడ్డి, దొడ్డ శేషాద్రి, ఈదుర మల్లయ్య, నాగేంద్రబాబు, సత్యనారాయణ, షేక్ రఫీ, కడియాల శ్రీనివాస యాదవ్, చిదా మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

కళకళలాడిన పెద్ద మంతనాల ఆలయ ప్రాంగణం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని నల్లమల అడవి ప్రాంతంలో గల పెద్ద మంతనాల ఆలయం వద్ద ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ధ్రమరాంబిక డిగ్రీ కళాశాల, మరియు వసంత జూనియర్ కళాశాల, కరస్పాండెంట్ బట్టు సుధాకర్‌రెడ్డి, బట్టు రమణారెడ్డి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద మంతనాలమ్మ దేవాలయంలో ఆదివారం ఇతర ప్రాంతాల నుండి భక్తులు అధికంగా రావడంతో ఆలయంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుండి భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టారు. కాయ కర్పూరాలు సమర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతన వాహనములకు పూజలు చేయించారు. భక్తులు ఆలయానికి అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత టీడీపీ - జనసేనపైనే ఉంది

- రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన కలయిక అవసరం
- వచ్చే ఎన్నికల్లో గెలుపుపై సమిష్టి కృషి చేయాలి
- జిల్లా అభివృద్ధిపై 12 తీర్మానాలను ఆమోదించిన సమన్వయ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత, తెలుగుదేశం పార్టీ, జనసేనపైనే ఉందని వచ్చే ఎన్నికల్లో కలిసి పనిచేసి రాష్ట్రాన్ని కాపాడుకోవడం తోపాటు వెనుకబడిన ప్రకాశం జిల్లా సమగ్ర అభివృద్ధికి చేయవలసిన అంశాలపై తెలుగుదేశం, జనసేన సమన్వయ కమిటీ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించి పలు తీర్మానాలను ఆమోదిం చారు. ఆదివారం ఒంగోలులోని ఎంఎస్ ఫంక్షన్ హాలులో తెలుగుదేశం, జనసేన సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో వైకాపా ప్రభు త్వం చేస్తున్న ఆరాచకాలపై చర్చించారు. తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్ర బాబు నాయుడును అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రాష్ట్ర భవిష్యత్తు ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన పార్టీలు కలిసి పనిచేయాలని రాష్ట్రాన్ని కాపాడుకోవడంతో పాటు వెనుక బడిన ప్రకాశం జిల్లాను అభివృద్ధి ఏ విధంగా చేయాలో ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాలకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, ఆయా నియోజకవర్గాల ఇన్చార్జిలతో పాటు జనసేన పార్టీలకు చెందిన ఆయా నియోజకవర్గాల ఇన్చార్జిలు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ పదాధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం సృష్టిస్తున్న అరాచకాలను ఏ విధంగా ఎదుర్కోవాలి. వెనుకబడిన ప్రకాశం జిల్లాలో ప్రధాన సమస్యగా ఉన్న త్రాగు, సాగునీరు కోసం వెలిగొండ ప్రాజెక్టును సత్వరమే పూర్తిచేసి ప్రజలకు తాగు, సాగునీరు అందించాలి. అలాగే మెరుగైన పునరావాస ప్యాకేజీని ముంపు గ్రామాల బాధితులకు అందించాలని తీర్మానం చేయ డం జరిగింది. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు త్రాగు నీటితో పాటు రైతులకు సాగునీరు పూర్తిస్థాయిలో గుండ్లకమ్మ, సంగమేశ్వర, కొరిశపాడు ప్రాజెక్టు, గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగింపు, ఇతర పెండింగ్‌లో ఉన్న ఇతర ప్రాజెక్టులన్నింటిని నిర్దిష్ట కాల వ్యవధిలో టీడీపీ, జనసేన ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడాదిలోపే పూర్తి చేసి ప్రజలకు నీరందిస్తామని. నాగార్జున సాగర్ కుడికాలువతో గోదావరి నీళ్లు నగరికల్లు దగ్గర ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేస్తాం. వెలిగొండ కుడికాలువలో మోసి, పాలేరు నదులను అనుసంధానం చేయడం జరుగుతుంది. కందుకూరు నియోజక వర్గం గుడ్లూరు మండలంలో హార్టికల్చర్ కళాశాలను నిర్మాణం చేయుట. వెనుక బడిన ప్రకాశం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి ప్రత్యేక కరువు ప్యాకేజీ ప్రకటించి రైతులను ఆదుకోవాలి. ఎన్ ఎస్‌పి కుడి కాలువ మరియు కొమ్మమూరు కాలువ ద్వారా నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలి. నవంబర్ 1వ తేదీ నుంచి టీడీపీ సూపర్ సిక్స్ - జనసేన షణ్ముఖ వ్యూహ లతో సిద్ధం చేసిన ఉమ్మడి మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. దొంగ ఓట్ల చేర్పుల్లో ప్రభుత్వ దుర్మార్గ వైఖరిని తెలుగుదేశం, జనసేన పార్టీలు సంయుక్తంగా పనిచేయాలి.

గ్రామాలలో ఎండుతున్న పంటలు

విశాలాంధ్ర-దర్శి : దరిశి మండలం చందలూరు గ్రామంలో పంట పొలాలను సిపియం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, నియోజక వర్గ కార్యదర్శి తాండవ రంగారావు, సందు వెంకటేశ్వరరావు, ఎస్.హెచ్ ఆదినారాయణ ఆదివారం పరిశీలించారు. ఖరీ పోగాకు పంట వేసి 45 రోజులు అయినది ఇప్పటికి 32 వేలు పెట్టుబడి పెట్టామని వర్షాలు లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి చచ్చి పోతున్నాయని అని చందలూరు కి చెందిన రైతు పుప్పాల రాఘవులు ఆవేదన వ్యక్తం చేశారు. బోరులు ఉన్న వాటిలో కూడా భూగర్భ జలాలు అడుగంటి పోయాయని, నీరు రావడం లేదని కంది, పత్తి, మిరప పంటలు కూడా ఎండిపోతున్నాయని రైతులు సిపియం నాయకులు ఎదుట విలపించారు. సిపియం జిల్లా నాయకులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ కరువు ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయని, కరువుతో అల్లాడుతున్న ప్రజలను ఆదుకోవలసిన వైసిపి ప్రభుత్వం ఓట్లు వేటలో పడి బస్సు యాత్రలు చేస్తుందని విమర్శించారు. దరిశి మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, ట్యాంకర్ల ద్వారా మంచినీరు అన్ని గ్రామాలకు సరఫరా చేయాలని, పశుగ్రాసం లేక పాడి గేదెలు బక్కచిక్కి పోతున్నాయని, పాలు ఇవ్వడం తగ్గి పోయిందని, పశుగ్రాసం సరఫరా ప్రభుత్వమే చేసి అందించాలని, రైతులను, కూలీలను ఆదుకోనుటకు 14 రకాల నిత్యావసర వస్తువుల సరఫరా చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపియం దరిశి నియోజక వర్గ కార్యదర్శి తాండవ రంగారావు మాట్లాడుతూ దరిశి పట్టణానికి త్రాగునీరు వారానికి ఒకరోజు మాత్రమే ఇస్తున్నారని, సాగర్ నీరు ప్రత్యేకంగా మంచినీటి కోసం వదిలినా ఎందుకని గ్రామాలలో ఎక్కడా సాగర్ మంచినీరు ఇవ్వడం లేదని, దీనికి ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కనపడుతుందని, వాటర్ ప్లాంట్లలో 20 రూపాయలు చెల్లించి తాగవలసిన దుస్థితి వచ్చిందని, ఈ పరిస్థితులకు ప్రభుత్వం బాధ్యత వహించాలని, తగిన మూల్యం జగన్ ప్రభుత్వం చెల్లించుకుంటుందని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించి కరువుతో ఉన్న ప్రజలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

నీరు పెట్రోల్ వాసనతో పెట్రోల్ బంకు సమీప వాసుల ఇక్కట్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకన మిట్ల బస్టాండ్ సమీపంలో గల హెచ్ పి పెట్రోల్ బంకు సమీప నివాస ప్రాంతాల వారి బోర్లలో నుండి వచ్చే నీరు పెట్రోల్ వాసన వస్తుండి దీంతో నివాస ప్రాంతాల వారు ఇబ్బందులు గురవుతు న్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఐదు నెలల నుంచి నీరు పెట్రోల్ వాసన వస్తుం దని పెట్రోల్ బంకు యాజమాన్యం వారికి ఎన్నిసార్లు విన్నవించుకున్నప్పటికీ వారు పట్టించు కోవడంలేదని ఆ నీరు వాడటం వలన చర్మవ్యాధులు సంక్రమిస్తున్నాయని ఆ నీరు పశువులు సైతం తాగడం వల్ల అనారోగ్యానికి గురవుతున్నాయన్నారు. ఆదివారం పెట్రోల్ బంకు వద్ద నిరసన తెలిపారు. ఈ సమస్య పరిష్కరించకపోతే బంకు వద్ద ధీక్ష చేపడతామని వారు హెచ్చరించారు ఇప్పటికైనా పెట్రోల్ బంకు యాజమాన్యం వారు స్పందించి ఆ సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్కేటింగ్‌లో రెండవస్థానం

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : ఇండియా అమెచ్యూర్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏడు గుండ్లపాడు శ్రీ హర్షిణి జూని యర్ కాలేజీలో ఆదివారం నిర్వహించిన జూనియర్ స్కేటింగ్ పోటీలలో ఓవరాల్ చాంపియన్ షిప్ సెకండ్ ప్లేస్ విజేతగా శిద్దా ఆరాధ్య సబ్ జూనియర్ బాలుర విభాగంలో విజేతగా శిద్దా త్రిష్ నిలిచారు. స్కేటింగ్ పోటీలలో తమ ప్రతిభను చాటి ఓవరాల్ చాంపియన్ షిప్ రెండవ స్థానంలో నిలిచిన శిద్దా ఆరాధ్యను మరియు సబ్ జూనియర్ విభాగంలో విజేతగా నిలిచిన శిద్దా త్రిష్‌కు నిర్వాహకులు మెమెంటో అందచేసి అభినందించారు.

మాదిగల మాలల ఆత్మీయ సమ్మేళనం

విశాలాంధ్ర-టంగుటూరు : మండల కేంద్రమైన టంగుటూరులోని వైఎస్ఆర్ పార్టీ కార్యాలయంలో కొండెపి నియోజకవర్గ ఆరు మండలాల మాల మాదిగల సమావేశం కొండెపి నియోజకవర్గం ఇంచార్జ్ వరికూటి అశోక్‌బాబు ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమా నికి సింగరాయకొండ టంగుటూరు పొన్నలూరు జరుగుమల్లి మర్రిపూడి పొన్నలూరు మండలాల ఎస్సీలు ఈ సమావేశానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ పార్టీ కొండెపి నియోజ కవర్గ ఇన్చార్జి అశోక్ బాబు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆమలపరిచిన రాజ్యాంగంలో ఎస్సీలు అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో మన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలను ఏర్పాటు చేసి ప్రజలకు చేరువయ్యారు నియోజక వర్గంలో జరుగుతున్న పరిస్థితిని చూసి వరికూటి అశోక్ బాబుకు మరల ఇంచార్జి ఇచ్చారని జగన్మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి చేరే విధంగా గడపగడపకి మన ప్రభుత్వం అని కార్యక్రమం ద్వారా సంక్షేమ పథకాలు అనే ఉద్దేశంతో నేరుగా లబ్ధిదారుల ఖాతాలో డబ్బులు జమ చేస్తూ ఎస్సీ ఎస్టీ మైనార్టీల కలుపుకొని పోతూ అంతేకాకుండా జన్మభూమి కమిటీలు పెట్టి పేదల సొమ్మును దోచుకున్నా న్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని సంక్షేమ పథకాలు లబ్ది పొందిన వారు అల్లా ముఖ్యమంత్రి చేస్తారని ఆదిమూలపు కొండెపి నియోజకవర్గంలో వరికూటి అశోక్ బాబును నియోజకవర్గ ప్రజలు గెలిపిస్తా రన్నారు. అనంతరం ఎంపీటీసీలకు ప్రజాప్రతి నిధులకు ఎస్సీలు సన్మానం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పార్టీలో టీడీపీ నుండి కార్యకర్తలు వైసీపీలో చేరారు.

ఆర్టీసీ డ్రైవర్ల పై దాడి హేయమైన చర్య

విశాలాంధ్ర-మార్కాపురం : ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానానికి చేర్చే ఆర్టీసీ డ్రైవర్లు పై దాడికి పాల్పడడం హేయమైన చర్య ఆర్టీసీ డ్రైవర్ సంఘ నాయకులు దుయ్యబెట్టారు. నెల్లూరు జిల్లా కావలిలో ఆర్టీసీ డ్రైవర్ పై చేసిన దాడిని ఖండిస్తూ మార్కాపురం ఆర్టీసీ డిపో ఎదుట జేఏసీ, ఎన్ ఎం యూ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తూ ప్రయాణికు లను సురక్షితంగా గమ్యస్థానానికి చేరవేసే ఆర్టీసీ డ్రైవర్ల పై దాడి చేయడం సరైన పద్ధతి కాదని ధ్వజమెత్తారు. ఆర్టీసీ డ్రైవర్ల పై దాడికి దిగితే సహించేది లేదని, కావలిలో రాజకీయంగా పై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ ధర్నా నందు డిపో అధ్యక్షులు వెంకటేశ్వర్లు ఎన్‌ఎంయు కార్యదర్శి కాశయ్య, జోనల్ సహాయ కార్యదర్శి శాస్త్రి, రీజనల్ నాయకులు భాషా హుస్సేన్, ఎన్‌ఎంయు నాయకులు భాషా, హుస్సేన్, పాలంకయ్య, హుస్సేన్, శిక్షావలి, వివిధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా కళ్లకు నల్ల రిబ్బన్



విశాలాంధ్ర-ముండ్లమూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌కు నిరసనగా కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మండలంలోని శంకరాపురం గ్రామంలో ఆదివారం రాత్రి మండల టీడీపీ అధ్యక్షులు కూర పాటి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, గ్రామ సర్పంచి కూర పాటి మహేశ్వరి నారాయణస్వామి ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీపీ వెంకటరావు మాట్లాడుతూ చంద్రబాబు వస్తున్న ప్రజాదరణ చూసి వైసిపి ప్రభుత్వం ఓర్వలేక అక్రమ అరెస్టు చేసి జైల్లో పెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

ఎస్సీవికే నిలయం నూతన కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-మార్కాపురం : 125 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన శ్రీ కొప్పరపు వెంకటకృష్ణ నిలయం (రీడింగ్ రూమ్) సొసైటీకి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్ను కోవడం జరిగింది. నిలయం సర్వ సభ్య సమావేశం ఆదివారం రీడింగ్ రూమ్ ఆవ రణలో జరిగింది. అధ్యక్షులుగా డాక్టర్ ఇమ్మడిశెట్టి బాల సుబ్బారావు (బిబిఎస్ఆర్), కార్యదర్శిగా గుంటకు సుబ్బారెడ్డి, ఉపాధ్యక్షులుగా శాసనాల వీరబ్రహ్మం, సహాయ కార్యదర్శిగా ఎం రామ్మోహన్, కోశాధికారిగా పి మల్లికార్జున రావు లు ఎన్నిక య్యారు. ఈ ఎన్నికల ప్రక్రియ కార్యక్రమానికి ఎన్నికల అధికారులుగా ఎస్ వికెపి డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ ఓ. డేవిడ్ సాల్మన్, చిదా శ్రీనివాస మల్లికార్జున రావులు వ్యవహరించారు. నూతన కమిటీని పలువురు ప్రముఖులు అభినందించారు.

వర్షాలు లేక రైతుల కళ్ళల్లో కంటతడి

- వానలు లేక నిట్ట నిలువునా ఎండిపోతున్న పంటలు
- మొక్కలను కాపాడుకునేందుకు రైతులు భగీరథయత్నం
- అరకొర ఉన్న నీళ్లతోనే మొక్కలను తడుపుతున్న వైనం
- ఎండుతున్న పంటలను చూసి తల్లడిల్లుతున్న రైతాంగం
- పశుగ్రాసానికి తప్పని తిప్పలు

విశాలాంధ్ర-పీసీపల్లి : రాష్ట్రంలో వర్షాలు సక్రమంగా లేక కాలువల్లో వాగుల్లో నదుల్లో నీళ్లు ఎండిపోవడంతో బోర్లలో సైతం భూగర్భ జలాలు అడుగంటడంతో పశ్చిమ ప్రకాశం పరిస్థితుల నేపధ్యంలో ఖరీఫ్ సీజన్ లో రైతులు సాగు చేసిన పంటలు కళ్ళముందే ఎండిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూసి అన్నదాతలు కన్నీటి పర్యంతం అవుతున్నారు. పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు అనేక భగీరథ ప్రయత్నాలు చేస్తున్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉన్న అరకొర నీళ్లతోనే తెల్లవారుజాము నుండే పొలాలకు పోయి ఉన్న నీటితోనే తడిపెట్టుకుంటూ మొక్కలను కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఎండిపోతున్న పంటలను కాపాడుకునేందుకు రైతులు పడుతున్న పడ్డవారీతం వర్షం ముఖం చాటేసిన నేపథ్యంలో అంతర పంటలు సైతం పూర్తిగా ఎండిపోవడంతో రైతులకు కోలుకోలేని పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఎంతో దుకృతంలో ఉన్న మూగజీవులకు అవసరమైన పశుగ్రాసం దక్కుతుందని భావించిన రైతులకు పచ్చని కటకం కరుకించిపోవడంతో పశుగ్రాసం పూర్తిగా నష్టపోతున్నారు. గత మూడు నెలల నుండి వర్షం ముఖం చాటేయడంతో సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బ తిన్నది. ఇలా సాగు చేసిన ప్రతి సంవత్సరం రైతులకు నష్టాలు రావడంతో సాగుపై రైతులు విముఖత వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుండి కూడా రైతులకు కేవలం భరోసా అంటూ సంవత్సర కాలంలో విడతల వారీగా ఇచ్చే రూ 12 వేల రూపాయలు ఒక ఎకరా సాగు చేయటానికి కూడా ఏమాత్రం సరిపడని పరిస్థితి దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎకరాకు కనీసం రూ. 20వేల రూపాయలు పెట్టుబడి అవుతుందని రైతన్నలు వాపోతున్నారు. దీంతో ఎప్పటికప్పుడు రైతులు పంటలు పండించడానికి ప్రభుత్వాలు ప్రోత్సాహకాలు అందించవలసిన అవ సరం ఎంతైనా ఉందని లేకపోతే పంటల సాగు లేక నిత్యవసర ధాన్యాలు ధరలు మార్కెట్లో గణనీ యంగా పెరిగిపోయి దేశంలో ఆర్థిక అసమా నతలు నెలకొనే అవకాశాలు అధికంగా ఉంటా యని పలువురు నిపుణులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. గత కొన్ని సంవత్సరాలనుండి రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధరలు ఏమాత్రం లేకపోవడంతో రైతన్నలు ఆరుగాలం శ్రమించి పంటలు పండించినా నష్టం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు దీంతో సంవత్సర సంవత్సరానికి సాగు అంతరించి పోతుందని, రైతే రాజు అన్న నేతల మాటలు ఇప్పుడున్న పరిస్థితుల నేపథ్యంలో నేతలు రైతులను తుంగలో తొక్కి వ్యాపార కోణంలో ప్రభుత్వాల పరిపాలనను సాగిస్తు ఉండడంతో రైతన్న రాజుగా పరిగణించలేకపోతున్నారు. దీంతో రైతన్నలు అప్పులు ఊబిలో కూరుకుపోయి చివరకు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు.